సాక్షి
వికారాబాద్

శుక్రవారం | 25 | అక్టోబర్ | 2024



సార్.. మా సమస్య వినండి!

సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధికి గ్రామ నాయకులు నడుం బిగించారు. 8లో▸



కలప పట్టివేత

అక్రమంగా కలప తరలిస్తున్న వాహనాన్ని ధారూరు పోలీసులు పట్టుకుని, కేసు నమోదు చేశారు. 8లో▸



ఆ రోడ్డు గుంతలమయం..!

పల్లె రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రయాణం కష్టమవుతోందని గ్రామీణ ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

నేడు లగచర్ల రైతులతో కలెక్టర్ సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్

దుద్యాల్: మండల పరిధిలోని లగచెర్ల రైతులతో కలెక్టర్ ప్రతీక్‌జైన్ శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమవుతారని తహసీల్దార్ వెంకటేశ్‌ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో ఏర్పాటు చేయనున్న ఫార్మా కంపెనీకి సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు వెల్లడిస్తారని స్పష్టంచేశారు. ఫార్మాకు భూములు ఇచ్చే రైతులతో ముఖాముఖి చర్చిస్తారన్నారు. సంబంధిత రైతులు విధిగా సమావేశానికి హాజరు కావాలని సూచించారు. కార్యక్రమానికి తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర ప్రసాద్, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్, దుద్యాల్ మండల రెవెన్యూ సిబ్బంది హాజరవుతారని వెల్లడించారు.

సీనియర్ సివిల్ జడ్జిగా వెంకటేశ్వర్లు



స్వాగత సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వెంకటేశ్వర్లు

అనంతగిరి: వికారాబాద్ సీనియర్ సివిల్ జడ్జిగా ఎం.వెంకటేశ్వర్లు వచ్చారు. భద్రాద్రి జిల్లాలో పనిచేసిన న్యాయమూర్తి పదోన్నతిలో భాగంగా వికారాబాద్ కోర్టుకు వచ్చారు. ఈ సందర్భంగా గురువారం ఆయనకు స్వాగత సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్ర కిశోర్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి డీబీ శీతల్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, అదనపు న్యాయమూర్తి శృతిదూత, సీనియర్ న్యాయవాదులు గోవర్ధన్ రెడ్డి, వెంకటేశ్, పరమానందరావు, కమాల్ రెడ్డి, నారాయణ, సంపూర్ణానంద్, యాదవ రెడ్డి, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేయొద్దు



పరిగిలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పరిగి: విధులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని కలెక్టర్ ప్రతీక్‌జైన్ హెచ్చరించారు. పరిగిలోని తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆఫీసులోని రికార్డులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని తహసీల్దార్ ఆనంద్ రావును ఆదేశించారు. ప్రజలు ఒకే సమస్యపై అనేకసార్లు కార్యాలయానికి రాకుండా చూసుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఆర్డీఓ వాసుచంద్ర ఉన్నారు.

కుటుంబ కలహాలతో భార్యను హత్య చేసిన భర్త

తాండూరు టౌన్: కుటుంబ కలహాలతో భార్యను హత్య చేసిన వ్యక్తి పోలీసులకు లొంగిపోయాడు. పట్టణ సీఐ సంతోష్ కుమార్ వివరాలిలా ఉన్నాయి. యాలాల మండలం కమాల్‌పూర్‌కు చెందిన శ్రీకాంత్ పట్టణంలోని ఓ చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. ఇతనికి గతంలోనే వివాహం జరిగింది. ఇదే గ్రామానికి చెందిన సుజాత (25)కు ఎనిమిదేళ్ల క్రితం వివాహమై భర్త, కూతురుతో కలిసి గుజరాత్‌లో నివసించేది. గతంలో సుజాత, శ్రీకాంత్ ప్రేమించుకున్నట్లు సమాచారం. దీంతో నాలుగేళ్ల క్రితం శ్రీకాంత్ గుజరాత్ వెళ్లి సుజాతతో పాటు ఆమె కూతురును తాండూరుకు తీసుకువచ్చాడు. అనంతరం ఆమెను రెండో వివాహం చేసుకుని, పాత తాండూరులోని రైల్వే గేటు సమీపంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈక్రమంలో గురువారం కర్ర తీసుకుని సుజాత తలపై శ్రీకాంత్ బలంగా కొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం నిందితుడు నేరుగా పీఎస్‌కు వెళ్లి లొంగిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

ఇందిరమ్మ.. ఇదేందమ్మా!

కొలిక్కిరాని కమిటీల ఏర్పాటు

- కాంగ్రెస్ కేడర్‌లో కాక రేపుతున్న ప్రక్రియ
- మళ్లీమళ్లీ పేర్లు మారుస్తున్న ఎమ్మెల్యేలు
- అధికారులకు తలనొప్పిగా మారిన కమిటీల నియామకం
- జిల్లాలో యాభై శాతం కూడా పూర్తికాని వైనం



వికారాబాద్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఈ కమిటీల ఏర్పాటు గ్రామాల్లోని కాంగ్రెస్ శ్రేణుల్లో చిచ్చు రేపుతోంది. మా పేరు ప్రతిపాదించాలంటే.. లేదు మా పేరే ఉండాలి.. అంటూ అధికార పార్టీ నేతలు పోటీ పడుతున్నారు. ఈ వ్యవహారం స్థానిక ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారింది. దీంతో ఇప్పటికే పూర్తవ్వాల్సిన ఇందిరమ్మ కమిటీల నియామకం ఇప్పటికీ యాభై శాతం కూడా కొలిక్కి రాలేదు. దాదాపు సగం కమిటీలు పూర్తయ్యాయని అధికారులు చెబుతుండగా వేసిన వాటిలోనూ పేర్లను మళ్లీమళ్లీ మారుస్తుండటంతో ఫైనల్ కావడం లేదు. ఈ వ్యవహారం అధికారులకు సైతం తలనొప్పులు తెచ్చి పెడుతోంది. కమిటీల ఏర్పాటు అయిపోయిందని చెబుతున్న ఎమ్మెల్యేలు తరచూ పలు పేర్లు మార్చాలంటూ జాబితాను వెనక్కి తీసుకుంటున్నారు. దీంతో ఏం చేయాలో తోచక అధికారులు సతమతమవుతున్నారు.

ఏర్పాటు ఇలా..

రాష్ట్ర వ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో మొదటి విడత ఒక్కో నియోజకవర్గానికి 3,000 నుంచి 3,500 ఇళ్లు వస్తాయని ఎమ్మెల్యేలు చెబుతున్నారు. వికారాబాద్ జిల్లాలో ఇప్పటికే 14,000 నుంచి 15 వేల ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులను గుర్తించినట్లు సమాచారం. అయితే లబ్ధిదారుల ఎంపిక విధానం నేరుగా అధికారులు కాకుండా గ్రామాల వారీగావేసిన ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎంపిక చేస్తారు. ఈ నేపథ్యంలో కమిటీల ఏర్పాటు ఎలా ఉండాలనే విషయంలో ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలు విడుదల చేసింది. కానీ క్షేత్రస్థాయిలో ఇవన్నీ నామమాత్రంగానే కనిపిస్తున్నాయి. ఇందిరమ్మ కమిటీల్లో చైర్మన్‌గా సర్పంచులు, కన్వీనర్లుగా పంచాయతీ కార్యదర్శులు ఉంటారు. ఇద్దరు స్వయం సహాయక సంఘాల సభ్యులు, మరో ముగ్గురు స్థానికులకు కమిటీలో స్థానం కల్పిస్తారు. ఇందులో ఒకరు ఎస్సీ, ఒకరు ఎస్టీ, ఒకరు బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారు ఉంటారు. మరో ఇద్దరు ఇతర సభ్యులు ఉంటారు. ప్రస్తుతం సర్పంచులు లేనందున వారి స్థానంలో ప్రత్యేకాధికారులు ఉంటారు.

వారు చెప్పిన వారికే చోటు..

పంచాయతీలు, పల్లెల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఎక్కడ కూడా నిబంధనల ప్రకారం జరగడం లేదనే ఆరోపణలున్నాయి. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, లేదా పార్టీ ఇన్‌చార్జ్‌ల కనుసన్నల్లోనే కమిటీలు వేస్తున్నారు. వీరు ఎవరి పేర్లను ప్రతిపాదిస్తే అధికారులు వారి వివరాలే నమోదు చేసుకుంటున్నారు.

మండల పరిషత్‌ల ఆధారంగా..

జిల్లాలో మొత్తం 20 రెవెన్యూ మండలాలు ఉండగా 18 మండల పరిషత్‌లు ఉన్నాయి. ప్రస్తుతం కమిటీల ప్రక్రియ మండల పరిషత్‌ల ఆధారంగా కొనసాగుతోంది. 18 మండలాల్లో ఇప్పటి వరకు తొమ్మిది చోట్ల కమిటీలు పూర్తి కావచ్చాయని అధికారులు చెబుతున్నారు. అయితే కాంగ్రెస్ కేడర్‌లో పోటీతోపాటు వివిధ కారణాలతో వేసిన కమిటీలనే మళ్లీమళ్లీ వేస్తున్నారు. పూర్తయిన వాటిని సైతం ప్రకటించడం లేదు. జిల్లాలోని 585 జీపీలకు గాను 307 పంచాయతీల్లో మాత్రమే ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు పూర్తయినట్లు తెలుస్తోంది. వీటిని కూడా అధికారికంగా ప్రకటించలేదు.



నీరు వృథాగా పోవడంతో ఖాళీ అయిన కుంట

ఆశ లేకుంట!

- తూము లీకేజీతో కుంటలోని నీరు ఖాళీ
- ఆందోళనలో ఆయకట్టు రైతులు
- పరిశీలించిన డీఈఈ కిరణ్‌కుమార్
- తక్షణ మరమ్మతులకు హామీ



తూమును పరిశీలిస్తున్న డీఈఈ కిరణ్ కుమార్

దుద్యాల్: వర్షాలు కురవడంతో నిండా నీటితో కళకళలాడిన చెరువు రైతులకు నిరాశే మిగిల్చింది. తూము లీకేజీ కారణంగా నీరంతా ఖాళీ అయిపోయింది. దీంతో మండల పరిధిలోని సంత్రకుంట తండా పరిధిలోని నాన్యనాయక్‌తండా రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గ్రామంలోని పీస్‌కుంట ద్వారా 70 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇటీవల కురిసిన వర్షానికి కుంట పూర్తిస్థాయిలో నిండి అలుగు పారింది. దీంతో పంటలు వేసేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ తూముకు పడిన రంధ్రంతో చెరువులోని నీరంతా వృథాగా దిగువకు వెళ్లిపోయింది. ఈ విషయాన్ని స్థానికులు సైతం గుర్తించకపోవడంతో కొద్ది రోజుల్లోనే కుంట ఖాళీఅయింది. నిండా నిండిన చెరువులోని నీరంతా ఏమవుతోందని..? ఆందోళన చెందిన రైతులు కట్ట పరిసరాలను పరిశీలించగా తూముకు పడిన రంధ్రం కనిపించింది. వెంటనే ఈ విషయాన్ని కొడంగల్ డీఈఈ కిరణ్ కుమార్‌కు తెలియజేశారు. వెంటనే స్పందించిన ఆయన గురువారం చెరువు, తూమును పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతు చర్యలు చేపడుతామని రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం కింద మరమ్మతులు చేపట్టాలని కోరినా ఫీల్డ్ అసిస్టెంట్ పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా సాధ్యమైనంత త్వరగా తూము లీకేజీని సరిచేయాలని కోరారు. లేదంటే పశువులకు తాగునీరు సైతం దొరకని పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారి కుంట కింద పంటల సాగు చేపట్టే అవకాశం లేదని, దీంతో పని లేకుండా పోవడంతో పాటు పశువులకు గ్రాసం కష్టాలు ఎదురవుతాయని తండావాసులు రవినాయక్, రాహుల్ తెలిపారు.



దుద్యాల్‌లో కోతకు వచ్చిన సన్నరకం వరి పైరు

సన్నాలకు కొర్రీలొద్దు

- అన్ని రకాలకు రూ.500 బోనస్ ఇవ్వాల్సిందే
- క్వింటాలుకు రూ.3,500 చెల్లించాలి రైతుల డిమాండ్

దుద్యాల్: సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో.. రైతులు సన్నవరి సాగుకు మొగ్గుచూపారు. వానాకాలం సీజన్‌లో సాగు చేసిన పంటలు ప్రస్తుతం ఇంటికి వస్తున్నాయి. అయితే ఎన్నికల ముందు ప్రకటించిన మేరకు అన్నిరకాల సన్న వడ్లకు బోనస్ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఈ అంశంపై ఇటీవల అనేక వార్తలు వస్తుండటంతో కర్షకులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని రకాలకే బోనస్ ఇస్తారని, మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారని పత్రికల్లో వార్తలు రావడం, ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాకపోవడంతో ఏం జరుగుతుందోనని టెన్షన్ పడుతున్నారు.

10వేల ఎకరాల్లో సాగు

దుద్యాల్ మండలంలో ఈసారి సుమారు 10 వేల ఎకరాలనుంచి 15 వేల ఎకరాల వరకు వరి సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తేల్చారు. ఇందులో సన్నాల సాగు సుమారు 10వేల ఎకరాలు ఉండవచ్చని చెబుతున్నారు. బోనస్ ప్రకటనతో దొడ్డు రకం వరి సాగుకు పెద్దగా ఆసక్తి చూపలేదని తెలుస్తోంది.

సాగు చేసిన రకాలివే..

మండలంలో ఎక్కువగా ఆర్‌ఎన్‌ఆర్– 15048, కేఎన్‌ఎం– సన్నాలు, బీపీటీ, కర్నూల్ సోనా, వరంగల్ సన్నాలు, కేపీఎస్ సన్నాలతో పాటు స్థానిక దుకాణాల్లో విక్రయించిన ధనిష్ట, శ్రేష్ఠ, కావేరి వంటి వెరైటీలను సాగు చేశారు. అత్యధికంగా తెలంగాణ సోనా ఎక్కువ విస్తీర్ణంలో సాగైందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. తాము పండించిన అన్ని రకాల సన్నాలకు బోనస్ చెల్లించాల్సిందేనని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ధర ఎక్కువే....

ఏ రకమైనా సన్నాలకు అధిక ధర ఉండాల్సిందే. దొడ్డు రకాల వడ్లతో పోలిస్తే సన్నాల సాగు కష్టమైనది. దీనికి తోడు దిగుబడి కూడా తక్కువే వస్తుంది. పంట కాల పరిమితి కూడా అధికంగా ఉంటుంది. ఎకరా పొలంలో దొడ్డు రకం వడ్లు 30 నుంచి 32 క్వింటాళ్లు పండితే.. సన్నరకం వడ్లు 20 క్వింటాళ్లకు దాటదు. ఈనేపథ్యంలో సన్నరకం వడ్లకు క్వింటాలుకు రూ.3,500 చెల్లించాలని రైతులు కోరుతున్నారు. లేదంటే పెద్దగా ఫలితం ఏమీ ఉండదని చెబుతున్నారు.

పొట్ట కొట్టొద్దు



ప్రభుత్వం అన్ని రకాల సన్న వడ్లకు బోనస్ ఇవ్వాలి. ఫలానే రకాలే కొంటాం అనే నిబంధనలు పెట్టకూడదు. బోనస్ వస్తుందనే ఆశతో అందుబాటులో ఉన్న విత్తనాలను సాగు చేశాం. ఇప్పుడు ప్రభుత్వం ఎలాంటి కొర్రీలు పెట్టొద్దు. నేను ఆర్‌ఎన్‌ఆర్– 15048 వరి సాగు చేశా. క్వింటాలుకు రూ.500 బోనస్ వస్తుందని ఆశిస్తున్నా.

– ఈరప్ప, రైతు, హస్నాబాద్

పెండింగ్ రోడ్డును పూర్తి చేస్తాం

- తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్
- జినుగుర్తితండా– అడికిచెర్లతండా మార్గం పరిశీలన



జినుగుర్తితండా వద్ద ఫారెస్ట్ భూమిలోని రోడ్డును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి తండా– అడికిచెర్ల మధ్య పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని గుండ్లమడుగుతండా– అడికిచెర్ల మధ్య ఉన్న ఫారెస్ట్ భూమిలోని రహదారిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జినుగుర్తి గేటు నుంచి అడికిచెర్ల వరకు 2016లో డబుల్ రోడ్డు మంజూరైందని తెలిపారు. జినుగుర్తితండా నుంచి పెద్దేముల్ మండలం అడికిచెర్ల మధ్య నాలుగు కిలోమీటర్ల మేర అటవీ భూమి ఉండటంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయని తెలిపారు. ఈ విషయమై కలెక్టర్, ఫారెస్ట్ ఉన్నతాధికారులతో మాట్లాడి.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా తగిన ఏర్పాట్లు చేస్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీదేవి, సెక్షన్ ఆఫీసర్ పర్యానాయక్, సిబ్బంది లాలప్ప ఉన్నారు.

అర్హులందరికీ న్యాయం చేస్తాం

- సర్టిఫికెట్లతో పాటు కాస్తులో ఉన్నవారికి పాసు పుస్తకాలు ఇస్తాం
- కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- అల్మాస్‌ఖాన్‌పేట్, మక్తవెంకటాపూర్, మందిపల్ రైతులతో సమావేశం



అల్మాస్‌ఖాన్‌పేట్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

కుల్కచర్ల: అర్హులైన రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని కలెక్టర్ ప్రతీక్ జైన్, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అల్మాస్‌ఖాన్‌పేట్‌లో గురువారం ఆయన రైతులతో సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత అరవై ఏళ్లుగా రైతులు, ప్రజలు భూ సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని వాటి పరిష్కారం దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగా రైతుల వద్ద ఉన్న భూ సంబంధిత ధ్రువీకరణ పత్రాలను పరిశీలించడంతో పాటు కాస్తులో ఎవరు ఉన్నారనే విషయాలను పరిగణనలోకి తీసుకుని, కొత్తగా పట్టాలు ఇచ్చేందుకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అల్మాస్‌ఖాన్‌పేట్ రెవెన్యూ గ్రామంలో 84 సర్వే నంబర్లు ఉండగా 1056.24 గుంటల భూమి ఉందని, ఇందులో కొన్ని తప్పిస్తే అన్ని సర్వే నంబర్లలోనూ ఇబ్బందికరమైన పరిస్థితి ఉందని తెలిపారు. కాస్తులో ఉన్నవారు ఒకరైతే పట్టాలలో ఉన్నవారు మరొకరు ఉన్నారన్నారు. అనంతరం మక్తవెంకటాపూర్ గ్రామ పరిధిలో రైతులతో సమీక్ష నిర్వహించగా అత్యధికంగా రైతులు అటవీ ప్రాంతంలో కాస్తులో ఉన్నారని వెల్లడించారు. వీరికి పోడు పట్టాలు ఇచ్చే అవకాశం ఉందని, అసైన్డ్ భూములు ఇచ్చే ఆస్కారం లేదని తెలిపారు. మందిపల్‌లోని సర్వేనంబరు 208లో 143 ఎకరాలలో ఉన్నవారికి అసైన్డ్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు చట్టపరంగా ఉన్న అవకాశాలను పరిశీలిస్తామని చెప్పారు. తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషిచేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని రైతులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ మురళీధర్, ప్రభు, మాజీ జెడ్పీటీసీ రాందాస్‌నాయక్, ఎంపీడీఓ రామకృష్ణ, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజనేయులు, చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, యువజన విభాగం జిల్లా నాయకులు కుమ్మరి స్వామి, కుల్కచర్ల మాజీ ఎంపీటీసీ ఆనందం, నర్సింహనాయక్, తదితరులు పాల్గొన్నారు.

దిగుబడి తగ్గింది!

- నిరాశపర్చిన పెసర, మినుము, సోయా
- పంటలపై ప్రభావం చూపిన భారీ వర్షాలు
- ధరలు కూడా తగ్గడంతో దిక్కుతోచని రైతులు



తాండూరు వ్యవసాయ మార్కెట్

తాండూరు: వానాకాలం సీజన్‌లో రైతులు సాగు చేసిన పెసర, మినుము, సోయా పంటలపై వాతావరణం తీవ్ర ప్రభావం చూపింది. భారీ వర్షాలకారణంగా స్వల్పకాలిక పంటలు భారీగా దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. ఫలితంగా వేలాది క్వింటాళ్ల ఉత్పత్తులతో కళకళలాడే తాండూరు వ్యవసాయ మార్కెట్ దిగుబడులు లేక వెలవెలబోతోంది. గతేడాది భారీగా పలికిన ధరలతో పోలిస్తే ప్రస్తుతం వ్యత్యాసం చాలా కనిపిస్తోంది.

కొనుగోళ్లు అంతంతే..

తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో రెండు మూడేళ్లుగా పెసర, మినుము, సోయా ఉత్తత్తుల కొనుగోళ్లు ఆశించిన స్థాయిలో నమోదు కావడం లేదు. మార్కెట్లో ఆయా పంటలకు మంచి డిమాండ్ ఉన్నప్పటికీ వీటిరాక పూర్తిగా తగ్గిపోయింది. రెండేళ్ల క్రితం వరకు సీజన్ వచ్చిందంటే యార్డు మొత్తం ఎక్కడ చూసినా పంట కుప్పలతో ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. గతంలో ప్రభుత్వ మద్దతు కేంద్రాలు కొనసాగినా కూడా 40 వేల క్వింటాళ్లకు పైగానే తాండూరు మార్కెట్‌కు తరలివచ్చాయి. కానీ గడిచిన రెండుమూడేళ్లుగా ఇందులో సగం కూడా రావడం లేదు. ప్రస్తుత సీజన్‌లో తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో 17,301 క్వింటాళ్ల పెసర కొనుగోళ్లు జరిగాయి. క్వింటాలుకు గరిష్ట ధర రూ.7,600, కనిష్టధర రూ.6,507, సగటున రూ.6,750 చొప్పున పలికింది. 9,439 క్వింటాళ్ల మినుముల కొనుగోళ్లు జరగగా.. క్వింటాలుకు గరిష్ట ధర రూ.8,430, కనిష్ట ధర రూ.5,000, సగటు ధర రూ.5,800 చొప్పున పలికింది. సోయాబీన్ 3,690 క్వింటాళ్లు మార్కెట్‌కు రాగా గరిష్టంగా రూ.4,300, కనిష్టంగా రూ.4,130, సగటున రూ.4,250 చొప్పున ధరలు పలికాయి.

రైతులకు మద్దతు ధర కరువు..

గత సీజన్‌లో తాండూరు మార్కెట్ యార్డులో పెసర క్వింటాలుకు గరిష్ట ధర రూ.10,100, కనిష్ట ధర రూ.7,551, సగటు ధర రూ.8,905 చొప్పున పలికింది. మినుములు క్వింటాలుకు గరిష్ట ధర రూ.10,159, కనిష్ట ధర రూ.8,055, సగటు ధర రూ.9.479 పలికింది. గతేడాదితో పోల్చితే ఈ సీజన్‌లో పంట ఉత్పత్తుల కొనుగోళ్లతో పాటు ధరల్లోనూ భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. ఇదిలా ఉండగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో సాగు చేసిన పంటలకు నష్టం వాటిల్లలేదని వ్యవసాయ శాఖ అధికారులు ప్రకటించడం గమనార్హం. దీంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూడాలని అభ్యర్థిస్తున్నారు.



తాండూరు మార్కెట్‌కు వచ్చిన పంట ఉత్పత్తులు

క్లుప్తంగా

ఎర్రమట్టి లారీకి జరిమానా

సబ్‌ కలెక్టర్‌ చొరవతో మైనింగ్‌ ఏడీ కొరడా

తాండూరు రూరల్‌: అనుమతులు ఓ చోట.. డంపింగ్‌కు మరో చోటుకు తరలిస్తున్న ఎర్రమట్టి లారీకి సబ్‌కలెక్టర్‌ ఆదేశాల మేరకు మైనింగ్‌ శాఖ అధికారులు జరిమానా విధించారు. మైనింగ్‌ ఏడీ సత్యనారాయణ కథనం ప్రకారం.. పెద్దేముల్‌ మండలం పాషాపూర్‌ గ్రామ శివారులో జరినా మినరల్స్‌కు చెందిన ఎర్రమట్టి లారీని మండలంలోని మల్కాపూర్‌ శివారులోని ఐసీఎల్‌ ఫ్యాక్టరీకి తరలించాలి. కానీ బంట్వారం మండలానికి తరలిస్తున్నారు. గురువారం అటువైపు వెళ్తున్న తాండూరు సబ్‌ కలెక్టర్‌ ఉమాశంకర్‌ ప్రసాద్‌ జినుగుర్తితండా వద్ద ఎర్రమట్టి లారీని తనిఖీ చేశారు. అయితే విశాఖ సిమెంట్‌ ఫ్యాక్టరీకు తరలించే వే బిల్లుతో బంట్వారంకు తరలించడాన్ని గుర్తించారు. వెంటనే మైనింగ్‌ ఏడీతో సదరు లారీకి రూ.37 వేలు జరిమానా విధించారు. లీజుదారులు సరైన వే బిల్లులు తీసుకొని ఎర్రమట్టిని తరలించాలని సబ్‌కలెక్టర్‌ సూచించారు. మొదటిసారి కావడంతో జరిమానాతోనే విధిస్తున్నానని.. మరోసారి జరిగితే లీజు రద్దుతో పాటు క్రిమినల్‌ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కల్యాణం.. కమనీయం

ఘనంగా శ్రీ లక్ష్మీనరసింహాస్వామి వార్షికోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

పరిగి: పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహా స్వామి తృతీయ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాలకు పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాలల్లో భాగంగా గురువారం శ్రీ లక్ష్మీ నరసింహాస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్తజనసంద్రంలో స్వామివారికి కల్యాణం జరిపించారు. అనంతరం స్వామి వారిని పట్టణ కేంద్రంలోని పుర వీధుల గుండా పల్లకీ సేవా చేపట్టారు. ఉత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రభుత్వ భూమిని రక్షించండి



అడిషనల్‌ కలెక్టర్‌ లింగ్యానాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న సిరిగిరిపేట్‌వాసులు

తాండూరు రూరల్‌: మండల పరిధిలోని సిరిగిరిపేట్‌ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని రక్షించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు వికారాబాద్‌లో అడిషనల్‌ కలెక్టర్‌ లింగ్యానాయక్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో గ్రామ శివారులో ఉన్న 26 ఎకరాల ప్రభుత్వ భూమిని వేలం ద్వారా విక్రయించారన్నారు. గ్రామంలో నిరు పేదలు ఇళ్ల స్థలాలు లేకపోవ డంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనుక సదరు భూమిని గ్రామంలోని పేదలకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో బిచ్చిరెడ్డి, శివప్ప, మొగులప్ప, అరవింద్‌రెడ్డి, నర్సింలు, భద్రు, విజయ్‌, అశన్న, దత్తు, శివకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో యువకుడికి 20 ఏళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: ప్రేమ పేరుతో యువతిని నమ్మించి లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా 13వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి యం.వాణి తీర్పు చెప్పారు. దీనికి సంబంధించి కోర్టు ఏపీపీ మంజులా దేవి తెలిపిన మేరకు... మొయినాబాద్‌ మండలం నాగిరెడ్డిగూడ గ్రామానికి చెందిన కాశీ విశ్వనాథ్‌ (29) అదే గ్రామానికి చెందిన 24 ఏళ్ల యువతిని ప్రేమ పేరుతో మోసం చేశాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. రెండేళ్ల అనంతరం పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్‌ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన కోర్టు గురువారం జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. అలాగే బాధితురాలికి రూ.3 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థకు సిఫార్సు చేసింది.

సార్‌.. మా సమస్య వినండి!



సంత్రకుంటతండాలో ఒకే భవనంలో కొనసాగుతున్న పాఠశాల, అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ కార్యాలయాలు

- బడ్జెట్‌ రాకతో అభివృద్ధిపై ఆశలు
- గ్రామ సమస్యల పరిష్కారానికి నేతల పరుగులు
- కడా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

దుద్యాల్‌: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌ నియోజకవర్గం అభివృద్ధికి గ్రామ నాయకులు నడుం బిగించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. ఇటీవలే విడులైన రూ.43.70 కోట్లతో మండలంలో నిర్మించే మండల సమీకృత భవనాల నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధికి కేటాయించినట్లు కడా అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. అందులో రూ.8.50 కోట్లు సమీకృత భవనానికి వెచ్చించగా.. మిగిలిన నిధులను నియోజకవర్గంలోని గ్రామాలు, గిరిజన తండాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలు నిర్మాణాల కోసం వెచ్చించనున్నారు. ఇదే విషయంపై బుధవారం సాక్షి దినపత్రికలో 'దుద్యాల్‌ అభివృద్ధికి పెద్దపీట' అనే శీర్షికన కథనం రావడంతో గ్రామాల్లో ఉన్న నాయకులు ఆయా సమస్యలపై కడా ప్రత్యేక అధికారికి వినతులు అందిస్తున్నారు. గ్రామంలో ఉన్న ప్రతి సమస్యలను రాత పూర్వకంగా అధికారులకు తెలియజేసే ప్రయత్నం చేస్తున్నారు. సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కడా కార్యాలయం చుట్టూ నాయకులు ప్రదక్షిణలు చేస్తున్నారు.



నిధులు కేటాయించాలని కడా అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఈర్లపల్లివాసులు

నిధులు కేటాయించండి

గ్రామ అభివృద్ధి కోసం స్థానికంగా నెలకొన్న సమస్యలపై దుద్యాల మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామస్తులు కడా అధికారి వెంకట్‌రెడ్డికి వినతులు అందిచారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఉమ్మడి ఈర్లపల్లి గ్రామంలో అంగన్‌వాడీ భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. అలాగే గ్రామ పంచాయతీ భవనాలు లేకపోవడంతో కార్యకలాపాలు సాగించేందుకు ఇబ్బందిగా ఉందని వినతిలో పేర్కొన్నారు. సంత్రకుంట తండాలో ఒక్క గది ఉన్న భవనంలోనే పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ పంచాయతీ కొనసాగుతున్నాయని కడా అధికారి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఒక్క గది మూడు కార్యకలాపాలు జరుగుతుండడంతో తీవ్ర ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఈర్లపల్లి గ్రామానికి నిధులు కేటాయించాలని విన్నవించారు.

రాంగ్‌ రూట్‌.. సింగిల్‌ లైట్‌

- రాత్రి వేళ ఒకే లైట్‌ వేసుకుని, రాంగ్‌ రూట్‌లో వచ్చిన డీసీఎం
- వ్యాన్‌ డ్రైవర్‌ నిర్లక్ష్యంతో యువకుడి మృతి
- బైక్‌ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలు
- చికిత్స పొందుతూ ఆస్పత్రిలో దుర్మరణం
- యాలాల మండలం బెన్నూరులో విషాదం



ఇర్ఫాన్‌ (ఫైల్‌)

యాలాల: రాత్రిపూట భారీ వాహనం రోడ్డుపై వెళ్తున్నప్పుడు హెడ్‌ లైట్లను తప్పనిసరిగా వేసుకోవాలి. అదే సమయంలో నియమ నిబంధనలను పాటించాలి... కానీ అవేవీ తనకు పట్టనట్లు వ్యవహరించిన డ్రైవర్‌ నిర్లక్ష్యానికి ఓ నిండు ప్రాణం బలైంది. రాత్రి సమయంలో వెలగని డీసీఎం హెడ్‌ లైట్ల కారణంగా యువకుడు ప్రాణం కోల్పోయాడు. ఈ విషాద సంఘటన మండల పరిధిలోని బెన్నూరులో చోటు చేసుకుంది. గ్రామస్తులు, యాలాల ఎస్‌ఐ శంకర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. బెన్నూరు గ్రామానికి చెందిన మొల్ల మహబూబ్‌, షబాన బేగం దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కొడుకు షేక్‌ ఇర్ఫాన్‌(20) ఉన్నారు. కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటూనే ఇర్ఫాన్‌ జక్కేపల్లి సమీపంలోని ఆర్‌బీఎల్‌ ఫ్యాక్టరీలో వర్కర్‌గా పని చేస్తున్నాడు. అతడు గత సోమవారం రాత్రి 9 గంటలకు అదే ఫ్యాక్టరీలో పనిచేసే స్నేహితుడి కోసం భోజనం పార్సిల్‌ తీసుకునేందుకు బైక్‌పై లక్ష్మీనారాయణపూర్‌కు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో బెన్నూరు శివారులోని ఏసు శిలువ మలుపు వద్ద ఎదురుగా ఒకే లైట్‌తో వస్తున్న డీసీఎంను గుర్తించలేకపోయాడు. దీనికితోడు ఆ ప్రాంతంలో రోడ్డుపై గుంతలు ఉండటంతో డీసీఎం డ్రైవర్‌ రాంగ్‌రూట్లో వచ్చాడు. ఈ క్రమంలో బైక్‌ను డీసీఎం బలంగా ఢీకొనడంతో ఇర్ఫాన్‌ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అతడిని తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వికారాబాద్‌ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి మార్చారు. అక్కడే చికిత్స పొందుతూ అతడు గురువారం మృతి చెందాడు. కొద్ది రోజుల్లో ఇర్ఫాన్‌ చెల్లెలు వివాహం సైతం ఉండటంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని, కేసు దర్యాప్తులో ఉందని ఎస్‌ఐ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

ధారూరు: అక్రమంగా తరలిస్తున్న కలప వాహనాన్ని ధారూరు పోలీసులు పట్టి వేశారు. వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక గుల్బర్గా జిల్లా చించొల్లి తాలుకాలోని కిష్టాపూర్‌ నుంచి వస్తున్న డీసీఎంను గురువారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు. రాత్రి వేళ బ్లూకోర్టు పెట్రోలింగ్‌ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది శంకర్‌, సుదర్శన్‌ ధారూరు ఎక్స్‌ రోడ్డు నుంచి తహసీల్దార్‌ కార్యాలయం వైపు వెళ్తుండగా డీసీఎంను నిలిపివేశారు. ఎక్కడి నుంచి వస్తున్నావు అని డ్రైవర్‌ శ్రీనివాస్‌ను ప్రశ్నించగా మౌనం వహించడంతో.. అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డీసీఎం పైన కప్పిన పాలిథిన్‌ కవర్‌ తీసి పరిశీలించగా ఎలాంటి అనుమతులు లేని కలప గుర్తించారు. కానిస్టేబుల్‌ శంకర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్‌ తెలిపారు.



కలప డీసీఎంను అదుపులోకి తీసుకున్న పోలీసులు

బీరు సీసాలో బల్లి అవశేషాలు!

- ఆందోళన వ్యక్తం చేసిన కొనుగోలుదారుడు
- మాకేం సంబంధం లేదన్న వైన్స్‌ నిర్వాహకులు

ధారూరు: మండల కేంద్రంలోని ఓ వైన్‌ షాప్‌లో కొనుగోలు చేసిన బీర్‌ బాటిల్‌లో బల్లి అవశేషాలు ఉన్నాయని మద్యం ప్రియులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని కేరెళ్లికి చెందిన ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డి, అనంతయ్య రూ.నాలుగు వేల విలువైన వివిధ రకాల మద్యం బాటిళ్లను మండల కేంద్రంలోని విజయదుర్గా వైన్‌ షాపులో కొనుగోలు చేశారు. అక్కడే ఉన్న మందుబాబులు ఓ బీరు సీసాలో బల్లి అవశేషాలు ఉన్నట్లు ఆరోపించి ఆందోళన చేపట్టారు. వైన్స్‌ నిర్వాహకులు మాత్రం కంపెనీ నుంచి వచ్చిన సీసానే అని బదులిచ్చారు. దీంతో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది.



బీరు బాటిల్‌లో ఉన్న అవశేషం

ఫాంహౌస్‌లో చోరీ

రూ.78 వేల విలువ గల వస్తువుల అపహరణ

పెద్దేముల్‌: ఫాంహౌస్‌లో చోరీ జరిగిన సంఘటన గురువారం పెద్దేముల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెగోండి గ్రామానికి చెందిన హైదర్‌కు గ్రామ శివారులో ఓ ఫాంహౌస్‌ ఉంది. అందులో గుర్రాలతో పాటు ఆవులు, మేకలను సాకుతున్నారు. ఇక్కడ నెల రోజుల క్రితం రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు(గణేశ్‌, చిన్నా) పని చేయడానికి వచ్చారు. వారికి గుర్రాలు చూసుకొని పని అప్పగించారు. బుధవారం ఇరువురూ కనిపించడం లేదని యజమాని హైదర్‌కు సమాచారం అందింది. వెంటనే ఫాంహౌస్‌కు వచ్చి చూడగా సుమారు రూ.78 వేల విలువ గల హోం థియేటర్‌, సీసీ కెమెరాలు, ట్రాక్టర్‌ బ్యాటరీ, బైక్‌ చార్జర్‌తో పాటు ఇతర వస్తువులు చోరీకి గురయ్యాయి. దీంతో గణేష్‌, చిన్నాలపై అనుమానం ఉందని యజమాని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుంటలో మునిగి వ్యక్తి దుర్మరణం

కుల్కచర్ల: స్నానం చేసేందుకు కుంటలోకి వెళ్లిన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కుల్కచర్ల గ్రామంలో అద్దెకుంటున్న సత్యపాల్‌ సింగ్‌(30) పాత ఇనుప సామగ్రి అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. గురువారం సాయంత్రం నింగిసాని కుంటలో స్నానం చేసేందుకు వెళ్లిన ఆయన అందులోనే ఇరుక్కుని పోయాడు. ఆయన మునిగిపోతున్న దృశ్యం చూసిన పలువురు కాపాడేందుకు ప్రయత్నించగా విఫలమయింది. వెంటనే సహాయక బృందానికి సమాచారం అందించారు. స్థానిక పోలీసులు, సహాయక సిబ్బంది మృతదేహాన్ని వెలికితీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరిశుభ్రతపై శ్రద్ధ తీసుకోవాలి



స్వచ్ఛత కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఐజయ్య

క్రీడా మంత్రిత్వ శాఖ అధికారి ఐజయ్య

దోమ: గ్రామాల్లో ప్రజలంతా పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ తీసుకోవాలని జిల్లాకు సంబంధించి క్రీడా మంత్రిత్వ శాఖ అధికారి ఐజయ్య తెలిపారు. గురువారం మండల కేంద్రంతో పాటు మోత్కూర్‌, దిర్సంపల్లి గ్రామంలో ఎంపీడీఓ మహేశ్‌బాబుతో కలిసి స్వచ్ఛత హి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరుగా చేయడమే కాకుండా ప్లాస్టిక్‌ వాడకాన్ని నిరోధించాలని సూచించారు. ప్రతి ఆదివారం యువత స్వచ్ఛతపై కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. యువతి, యువకులు గ్రామాల్లో సామాజిక సేవ చేసేందుకు ముందుండాలన్నారు. అనంతరం యువతి, యువకులకు మై భారత్‌ ఈవెంట్‌ డైరీ, టోపీ, పెన్నులు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్‌, ఎంపీఓ సోమలింగం, నెహ్రూ యువ కేంద్ర అకౌంటెంట్‌ సాయికృష్ణ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌ నేరాలపై అవగాహన అవసరం

డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

పెద్దేముల్‌: సైబర్‌ నేరాలపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. గురువారం పెద్దేముల్‌ పోలీస్‌ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మండలంలో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. మండలంలోని ఏఏ గ్రామాలల్లో సీసీ కెమెరాలున్నాయని ఎస్‌ఐ గిరిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ముఖ్యంగా సైబర్‌ నేరాలు, సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్‌ఐ గిరికి సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా గ్రామస్తులకు అవగాహణ కల్పించాలని సూచించారు.



ఠాణాలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

పోలీసులపై దాడి.. ముగ్గురి అరెస్టు

బంజారాహిల్స్‌: పీకలదాకా మద్యం సేవించి అర్ధ రాత్రి రోడ్లపై ఆవారాగా తిరుగుతూ న్యూసెన్స్‌కు పాల్పడుతున్న ముగ్గురు యువకులను 'రోడ్లపై ఎందుకు ఉన్నారు..ఇంట్లోకి వెళ్లండని' హితవు పలికినందుకు పోలీసులను చితకబాదిన ఘటన జూబ్లీహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..శ్రీనగర్‌కాలనీ గణపతి కాంప్లెక్స్‌ సమీపంలోని శాలివాహననగర్‌ రోడ్డులో బుధవారం అర్ధ రాత్రి రాజు, శేఖర్‌ అనే బ్లూ కోల్ట్స్‌ పోలీసులు విధి నిర్వహణలో తిరుగుతున్నారు. అదే సమయంలో శాలివాహననగర్‌లో నివసించే కార్తీక్‌, అశోక్‌ అనే ఇద్దరు అన్నదమ్ములతో పాటు మోహన్‌ అనే వీరి స్నేహితుడు ముగ్గురూ మద్యం మత్తులో ఊగిపోతూ రోడ్లపై తిరుగుతున్నారు. ఇంట్లోకి వెళ్లండి..రోడ్లపై ఏమి చేస్తున్నారంటూ పోలీ సులు వారికి చెప్పారు. వెళతాంలే.. మీరు మాకు చెప్పాల్సిన అవసరం లేదు..అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడారు. అయినా పోలీసులు వారి ముగ్గురిని ఇళ్లకు పంపించేందుకు ప్రయత్నిస్తుండగా ముగ్గురూ కలిసి పోలీసులపై దాడి చేసి చితకబాదారు. అరగంట పా టు రోడ్డుపై న్యూసెన్స్‌కు పాల్పడ్డారు. బాధి తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్‌ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఇందులో అశోక్‌, మోహన్‌లు సాఫ్ట్‌వేర్‌ ఇంజనీర్లుగా పనిచేస్తుండగా, కార్తీక్‌ డీజే ప్లేయర్‌గా పనిచేస్తున్నట్లుగా గుర్తించారు. జూబ్లీహిల్స్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సభను విజయవంతం చేద్దాం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆంజనేయులు తదితరులు

మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు

షాబాద్‌: మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేద్దామని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కంపేట ఆంజనేయులు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని చర్లగూడలో అంబేడ్కర్‌ విగ్రహం ఎదుట మాల సంక్షేమ సంఘం నాయకులతో కలిసి వాల్‌పోస్టర్‌ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు గడప గడపకూ తిరుగుతూ ఈనెల 27వ తేదీన జరిగే మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాలలంతా ఏకతాటిపై నిలిచి తమ ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే విధంగా పెద్దఎత్తున కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. మండలం నుంచి మాలలు భారీ సంఖ్యలో నాగర్‌కర్నూల్‌ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు సరైంది కాదన్నారు. వర్గీకరణ చట్టం అమలు పరచాలంటే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి అన్ని ఆమోదాలు పొందినప్పుడే సాధ్యపడుతుందన్నారు. దేశ వ్యాప్తంగా తీర్పును వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణకు అత్యుత్సాహం చూపిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌, ఎల్లయ్య, శ్రీనివాస్‌, నర్సింహులు, రాజు, సమతా సైనిక్‌ దళ్‌ జిల్లా నాయకులు వెంకటేశ్‌, కృష్ణ, ప్రవీణ్‌, కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్‌–1 పరీక్షలు

మొయినాబాద్‌రూరల్‌: మండల పరిధిలోని ఇంజినీరింగ్‌ కళాశాలల్లో జరుగుతున్న గ్రూప్‌–1 పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్‌ ట్రాఫిక్‌ సీఐ రాజేందర్‌గౌడ్‌ పేర్కొన్నారు. గురువారం 4వ రోజు కొనసాగుతున్న గ్రూప్‌–1 పరీక్ష కేంద్రాలను ఆయన సందర్శించారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్‌ చౌరస్తాలో గల విద్యాజ్యోతి, అమ్డాపూర్‌ చౌరస్తాలోని జేబీఆర్‌ఈసీ కళాశాలల్లో కొనసాగుతున్న కేంద్రాలను ఆయన పరిశీలించి అభ్యర్థులతో మాట్లాడారు. ట్రాఫిక్‌ ఇబ్బందులు ఎక్కడైనా తలెత్తుతున్నాయా అని తెలుసుకున్నారు. ప్రభుత్వం పరంగా ట్రాఫిక్‌ ఇబ్బందులు తలెత్తకుండా అభ్యర్థులు పరీక్షలు సజావుగా రాసేందుకు తమవంతు కృషిగా చేస్తున్నట్లు వివరించారు. క్రైమ్‌ డీఐ రమేశ్‌మధు పాల్గొన్నారు.



అమ్డాపూర్‌ చౌరస్తాలోని జేబీఆర్‌ఈసీ కళాశాల వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

బిల్లులు రాక.. అప్పులు తీరక!

- మనఊరు–మనబడి పథకానికి నిధుల గండం
- చేసిన పనులకు బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ల ఆవేదన
- అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న వైనం

దోమ: మనఊరు–మనబడి పథకం కింద పలు పాఠశాలల్లో పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు బిల్లులు రాక.. చేసిన అప్పులు కుప్పలుగా పేరుపోతుండడంతో ఆందోళనకు గురవుతున్నారు. వడ్డీలు కట్టలేకపోతున్నామని వాపోతున్నారు. చిన్న చిన్న బిల్లుల కోసం జిల్లా స్థాయి అధికారుల వద్దకు కాళ్లరిగేలా తిరగాల్సి వస్తుందని కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు.

25 పాఠశాలల ఎంపిక

దోమ మండలంలో మనఊరు–మనబడి పథకం కింద 25 పాఠశాలను అధికారులు ఎంపిక చేశారు. ఈ మేరకు రూ.7.50 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పాఠశాలలకు అందించారు. అందులో అదనపు గదులు, ప్రహరీలు, భవనాలకు రంగులతో పాటు ఫర్నీచర్‌, విద్యుత్‌, తాగునీరు, డైనింగ్‌ హాల్‌, కిచెన్‌షెడ్లు వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. గతంలో అట్టి పనులను ప్రధానోపాధ్యాయులు కొంత మంది సర్పంచులు, స్కూల్‌ చైర్మన్లు, కాంట్రాక్టర్లకు అప్పగించారు. వీటిలో శివారెడ్డిపల్లి, బొంపల్లి తండా పాఠశాలలో మాత్రం పనులు పూర్తయ్యాయి. మిగతా పాఠశాలలో పనులు పూర్తి కాలేకపోయాయి. కాంట్రాక్టర్లకు చేసిన పనులకు సంబంధించి బిల్లులు రాకపోవడంతోనే పనులను మధ్యలోనే వదిలేసినట్లు తెలుస్తోంది.



బొంపల్లి పాఠశాలలో పూర్తయిన పనులు

వడ్డీల భారంతో కుదేలు

దోమ, బొంపల్లి, కిష్టాపూర్‌, గుండాల, కొత్తపల్లి, బడేంపల్లి, దిర్సంపల్లి, మల్లేపల్లి, కిష్టాపూర్‌, ఐనాపూర్‌, బుద్లాపూర్‌, ఊటుపల్లి, తిమ్మాయిపల్లి, బ్రాహ్మణపల్లి, కొండాయపల్లి, దాదాపూర్‌, మోత్కూర్‌ పాఠశాలలో అప్పటి సర్పంచులు, పాఠశాలల చైర్మన్లు, కాంట్రాక్టర్లు మనఊరు–మనబడి పథకంలో వివిధ పనులు నిర్వహించారు. అయితే అట్టి పనులను అప్పులు తెచ్చి 80 శాతం మేర పనులు పూర్తి చేసినప్పటికీ బిల్లులు రాక వడ్డీలు సైతం కట్టలేని స్థితిలో అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. ఈ క్రమంలో మిగతా పనులను డబ్బులు రాక నిలిపివేశామని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు బిల్లులు మంజూరు చేయాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

పెండింగ్‌లో రూ.25 లక్షలు



బొంపల్లి జెడ్పీ పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాలకు రూ.54 లక్షలు కేటాయించారు. వాటితో పాఠశాలలో మౌలిక వసతులను కల్పించాం. అప్పులు తెచ్చి పనులు నిర్వహిస్తే ఇప్పటివరకు బిల్లులు సక్రమంగా రాలేదు. ఇంకా పెండింగ్‌లో రూ. 25 లక్షలు ఉన్నాయి.

– చంద్రశేఖర్‌, మాజీ వార్డు సభ్యుడు, బొంపల్లి

నిధులు విడుదల చేయాలి



మనఊరు–మనబడి పథకంలో నిర్వహించిన పనులకు బిల్లులు సక్రమంగా రావడం లేదు. కిష్టాపూర్‌ పాఠశాలలో రూ.15 లక్షలతో పనులు నిర్వహిస్తే, ఇంకా రూ.3.50 లక్షలు రావాల్సి ఉంది. బిల్లుల కోసం నిత్యం కలెక్టర్‌ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాం.

– యాదగిరిగౌడ్‌, మాజీ స్కూల్‌ చైర్మన్‌, కిష్టాపూర్‌